# రంగులు

పాలడుగు వెంకటేశ్వరరావు

ఒకరోజు కాలేజీనుంచి స్నేహితురాళ్ళతో కలిసి ఇళ్ళకి తిరిగి వస్తుండగా ఒక విచిత్రమయిన సంఘటనను చూసింది సబిత! రోడ్డు మీద పోతూవున్న ప్రతి వాడూ ఆగి నిలబడి, "అరె! అరెరె! అదేంటి అన్యాయం" అంటూ ఆశ్చర్యం, భయంతో పాటు, ఆందోళనకీ లోనయి ఉండిపోయాడేగాని ముందుకురికి వాళ్ళని ఎవరూ విడదీయలేకపోయారు. జెమా జెట్టీలవంటి నలుగురు యువతులు, ఒక

ఒంటరి యువకుడిమీద కలిసికట్టుగా ముట్టడి చేస్తున్నారు. ఆ నలుగుర్నీ ఎదుర్కొని నిలబడి, వాళ్ళు నాలుగు దెబ్బలు వేస్తే అతను ఒక దెబ్బయినా వేయటానికి ప్రయత్నిస్తూ వున్నాడు. ధైర్యంగా నిలబడి దెబ్బకి దెబ్బ తీయటానికి ప్రయత్నిస్తూ వున్నాడుగాని అలవికాని ప్రయత్నాన్ని విరమించి పారిపోవటానికి ఏమాత్రం అతను ప్రయత్నించటంలేదు. అతని మొండి పట్టుదలకి లోలోనే అభినందించినా, అతను పరిస్థితి సవితకి ఆందోళన కలిగించింది. సమయం గడిచినకొద్దీ అతను నీరసించిపోతూ వున్నాడు కాని తన ప్రయత్నం మానటంలేదు. అందు వలన అప్రయత్నంగానే "పోలీస్, పోలీస్" అంటూ కేకలు పెట్టింది సవిత. అల్లంతదూరంలో పోలీస్ విజిల్ విన్పించింది. అందువలన ఆ దుండగులు పారిపోయారు. రక్తం చిమ్ముతున్న గాయాలతో, చెదిరిన జుట్టుతో, మొహం నిండా చెమటతో అతను మిగిలి పోయాడు.

"ఏమిటండీ? ఎవరు వాళ్ళు?" అని అడిగింది అతని దగ్గరగా వెళ్ళి సవిత.

"ఎవరో రాస్కెల్స్. కాలేజీనుంచి తిరిగి వస్తూ వుండగా దారి కాచి మీద పడ్డారు. తగిన బుద్ధి చెప్పాను లెండి," రొప్పుతూ అన్నాడు.

"చాలా సంతోషం లెండి. మీకు ఎక్కువగా దెబ్బలు తగిలిన సంగతి గమనించినట్లు లేదు మీరు!" అని నాలుక కొరుక్కుంది సవిత. అతను నవ్వాడు. సవిత సిగ్గుపడింది. అలాగ పరిచయమయిన అతన్ని తరచూ కాలేజీలో చూస్తూనే వుంది సవిత. కాలేజి యూనియన్ ఎలక్షన్లప్పుడు, కాలేజీలో ఫంక్షన్సు జరిగినప్పుడూ అతను విద్యార్థుల్లో మంచి యాక్టివ్‌గా తిరుగుతూ వుండేవాడు.

అతని పేరు బ్రహ్మయ్య. బి. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతూ వుండేవాడు. తరచూ స్టేజి ఎక్కి ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అతని చుట్టూ ఎప్పుడూ చాలామంది విద్యార్థులు వుండేవారు. నలుగుర్నీ కూడగట్టటంలోనూ, ఉపన్యాసాలతో అందర్నీ ప్రభావితుల్ని చేయటంలోనూ అతను అద్భుతమయిన శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శిస్తూ వుండే వాడు. ఆ తరువాత స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్లప్పుడూ, ఇనాగరల్ ఫంక్షన్ జరిగినప్పుడూ సవితకి అతన్తో పరిచయం పెరిగింది.

పొట్టిచేతుల చొక్కా, ఖద్దరు పంచా, నల్లని ఉంగరాలు తిరిగిన క్రాపూ, బలిష్ఠమయిన ఆకర్షవంతమయిన విగ్రహం. ఆరోగ్యం, ఉత్సాహం మూర్తీభవించిన అతని వ్యక్తిత్వం, అన్నిటినీ మించి అతని పట్టుదలా... బ్రహ్మయ్యలోని ఈ లక్షణాలు సవితని

ఆకర్షించాయి. అందువలన సవిత అతనితో పరిచయాన్ని పెంచుకుంది.

అయిదుగురన్నల తర్వాత పుట్టి చాలా గారాబంగా పెరిగింది సవిత. ఆమె అంటే తల్లిదండ్రులకి వేదవాక్కు. ఆమె కోరితే కొండమీద కోతినన్నా తెచ్చి ఇవ్వాలని ఉత్సాహం చూపిస్తారు సవిత అన్నదమ్ములు. ఆమె తండ్రి గాంధేయవాది. కొడుకులందరికీ ఆయన మాట సుగ్రీవాజ్ఞ. వాళ్ళది బాగా కలిగిన కుటుంబం. పెద్ద బంగమూ.

ఆ సంవత్సరం గిరున తిరిగి పరీక్షలయ్యాక వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు ఆమె వివాహ విషయం ప్రస్తావనకి వచ్చింది. తండ్రితో తన మనసులోని మాటను సూచనగా తెలిపింది సవిత. ఆమె పెద్దన్నలు ఇద్దరూ ఆ వూరు వెళ్ళి బ్రహ్మయ్య గురించిన విషయాలు సేకరించుకుని వచ్చారు.

కుర్రవాడు బుద్ధిమంతుడే. తల్లి దండ్రులూ, తోడబుట్టినవాళ్ళూ ఎవరూ లేరు. ఏమంత ఆస్తిపాస్తులు లేవు. అతని మేనమామలు అతన్ని చదివిస్తున్నారు. కాని కుర్రవాడు ఆవేశ పరుడు. ముందూ వెనకా చూడని తత్త్వం. పైగా మొండివాడు. అంతావిని ఆమె అన్నలు, బంధువులు పెదవి విరిచారు.

"తల్లీ! నీకు పోలీసు ఆఫీసరు కావాలా? కలెక్టరుగా చేస్తున్న పెళ్ళి కొడుకు కావాలా? లేక అమెరికాలో వుద్యోగం చేస్తూవున్న డాక్టరు కావాలా? ఎవరు కావాలో చెపితే ఫొటోలు తెప్పిస్తాము. నీవు చూసి ఇష్టపడితే ఘనంగా పెళ్ళిచేస్తాము" అని అడిగారు అన్నలు.

చాలాసేపు ఆలోచించి, "నాకు బ్రహ్మయ్యగారు కావాలి" అంది సవిత.

"బాగా ఆలోచించు. నువేం చిన్న పిల్లవి కాను నాకు బొమ్మ కావాలి అంటానికి" అన్నాడు ఆమె పెద్దన్న అసహనంతో.

"ఇదేం ఆటగాదు. పెళ్ళి — అంటే నూరేళ్ళ జీవితం" అని హెచ్చరించాడు ఆమె రెండో అన్న.

"బాగా ఆలోచించు తల్లీ. నీ సుఖం కోసమే గదా మా తాపత్రయమంతాను" అని ప్రాధేయపడ్డారు మిగిలిన అన్నలు.

వాళ్ళు ఎవరికీ ఈ బ్రహ్మయ్య సంబంధం ఇష్టంలేదు. అందుకే సవిత మనసుని మళ్ళించటానికి రకరకాల ప్రయత్నాలు చేశారు. అయితే, ఆ ప్రయత్నాల సంరంభం హెచ్చినకొద్దీ సవిత నిర్ణయమూ మరింత గట్టిపడింది గాని ఏ మాత్రం సడలలేదు.

చివరికి ఆమె తండ్రి 'తాతయ్యగారు' తన నిర్ణయాన్ని ప్రకటించటంతో ఆ వివాదం సమసిపోయింది. బ్రహ్మయ్య

వూరు వెళ్ళి మంతనాలు సాగించారు ఆమె అన్నలు.

ఆ రోజులలోనే ఒకసారి సవితకోసం వచ్చాడు బ్రహ్మయ్య. ఆ సమయంలో మగాళ్ళు ఇంట్లో లేరు. అతన్ని చూసి ఎంతో సంతోషపడిపోయి ఆహ్వానించి కూర్చోపెట్టింది సవిత. సకల మర్యాదలూ చేసి స్వయంగా కాఫీ కలిపి తెచ్చి ఇచ్చింది.

చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాక అసలు విషయానికి వచ్చాడు బ్రహ్మయ్య.

"బహుశా ఈ సంగతి మీకు తెలీదనుకుంటాను" అన్నాడు.

"ఏ సంగతి ?" అన్న ఆమె ప్రశ్నకి బ్రహ్మయ్య ఇరుకున పడ్డాడు.

"అదే...అదే..." అన్నాడు.

"అదే అంటే ?" అంటూ కొంటెగా రెట్టించింది. బ్రహ్మయ్య చాలాసేపు ఆలోచనలోపడి నిట్టూర్చి అన్నాడు.

"మన ఇద్దరి మధ్యా అనుబంధం కుదిరేది గాదు."

"ఎందువలన ?"

"స్వాభావికంగా నేను కమ్యూనిస్టుని. మీ వాళ్ళందరూ భూస్వాములు. వర్గ వైరుధ్యం అనేది వుంది. అది వర్గాల్ని చాలా ఎడంగా వుంచే అవకాశం వుంది. అందువలన మన మధ్య ఏ రకమయిన బంధమయినా సరే అనేకమయిన ఇబ్బందుల్ని తెచ్చిపెట్టే ప్రమాదముంది."

"ఆ ఇబ్బందులు అధిగమించ జాలనివా ?"

"అవును."

"ఏమిటవి ?"

"ఘర్షణలు. వాటిమధ్య అనుబంధాలు ఆత్మీయతలు నలిగిపోతాయి."

"అయినా సరే సిద్ధమయితే..."

"అందువలన చాలా కష్ట నష్టాలుంటాయి. నీలాంటి సుకుమారి అసలే సహించలేదు."

"అయితే ఇప్పుడు ఏం చేస్తానంటారు ?" రోషంతో సవిత ముక్కుపుటాలు అదిరాయి.

"బాగా ఆలోచించి సరయిన నిర్ణయం తీసుకోమని కోరుతున్నాను" అన్నాడు.

సవిత చివాల్న లేచింది. ఉబికివస్తూ వున్న కన్నీటిని అణచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. బ్రహ్మయ్యకి పరిస్థితి అవగాహన అయింది, తల వంచుకుని కూర్చుని ఆలోచనలో పడ్డాడు.

కాసేపయాక మొహం కడుక్కొని తిరిగివచ్చింది సవిత. ఆమెని చూసి బ్రహ్మయ్య నవ్వాడు.

"సవితాదేవిగారూ !"

"ఏమిటి చెప్పండి" అంది సవిత కఠినంగా.

"మీ నిర్ణయం మారదంటారా ?"

"ఆ ప్రశ్న తలెత్తే అవకాశం లేదు.

అవసరమయితే అవివాహితగానయినా వుండిపోతాను" అంది సబిత నిశ్చలంగా.

"సరే. మీ నిర్ణయం ప్రకారమే మన పెళ్ళి జరగనీయండి."

సబిత మనస్సు సంతోషంతో నిండి పోయింది ఆమె కనులలో మెరుపులు తొంగిచూసాయి.

"చాలా థాంక్సండి" అంది.

''మరి నేను వెళ్ళివస్తాను.''

"ప్రొద్దుపోతూ వుంది. ఇప్పుడేం వెళ్తారు? ఇవేళ్టికి వుండి రేపు వుదయమే..."

"కాదు...లెండి నేను వెళ్ళిపోవాలి." అంటూ లేచి నాలుగడుగులు వేశాడు. వేసి, ఆగి వెనుదిరిగి వచ్చాడు. "నన్ను మీవాళ్ళు ఒక కోరిక కోరారు. అది చాలా వింతగా వుంది," అన్నాడు.

''ఏమిటది ?"

"మీవాళ్ళంతా మిమ్మల్ని చూడకుండా వుండలేరట. అందువలన నేను వచ్చి మీవూళ్ళోనే వుండాలట!''

''మీరేమన్నారు ?''

"ఇంకా ఏమీ అనలేదు. సరేననాల్సి వచ్చేటట్టుంది. మీ గురించి నాకు ఏదీ తప్పేట్టులేదు గదా!" నవ్వాడు బ్రహ్మయ్య.

"చాలా థాంక్సు.''

అతను లేచాడు. అతను చాలా దూరం వెళ్ళిపోయేదాకా అక్కడే నిలబడి చూస్తూ వుంది సబిత. మలుపు తిరగబోతూ ఆగి వెనుదిరిగి చూసాడు అతను. ఆమె అక్కడే నిలబడి అతన్నే చూస్తూ వుంది

ఆ వేసవిలోనే పెళ్ళి జరిగింది.

రిజల్ట్సు వచ్చాయి. బ్రహ్మయ్య సెకెండు క్లాసులో పాసయాడు.

సవిత ఇంటర్మీడియట్‌తోనే చదువు మానేసింది. అతను అత్తగారి వూళ్లో మకాం పెట్టాడు. సాయంత్రం శ్రామికులు వుంటూ వుండే గుడిసెల వైపు వెళ్ళేవాడు. రాత్రుళ్ళు బాగా ప్రొద్దుపోయాకగాని తిరిగి వచ్చేవాడు గాదు.

సంవత్సరం తిరగ్గానే సవిత తల్లి అయింది.

పాపకి "అరుణ" అని పేరు పెట్టాడు బ్రహ్మయ్య.

అప్పుడే గొడవలూ మొదలయ్యాయి.

ఒక వ్యవసాయకూలీకీ భూస్వామికీ తగవు వచ్చింది. ఘర్షణ అయి ఆ కూలీకి బాగా దెబ్బలు తగిలాయి. హాస్పిటల్‌లో చేర్చారు.

బ్రహ్మయ్య కూలీల తరవున ఆ భూస్వామిని నిలదీసి అడిగాడు.

"అలాగ చెయి చేసుకుని చావు దెబ్బలు కొట్టే అధికారం అతనికి ఎవరిచ్చారు ? అతను ఇవ్వదలచుకున్న సంజాయిషీ ఏమిటి ?"

"నేనేం సంజాయిషీ ఇవ్వవలసిన అవసరంలేదు." అని మొరాయించాడు ఆ భూస్వామి. వాద ప్రతివాదాలు ఎటూ తేలక పెద్ద గొడవయింది. చిలికి చిలికి గాలివాన అయింది.

వ్యవసాయ కూలీలు సమ్మె మొదలు పెట్టారు. వాళ్ళకి బ్రహ్మయ్య నాయకత్వం వహించాడు. సవిత అన్నదమ్ములు బ్రహ్మయ్యకి ఎన్నోవిధాల చెప్పారు. "ఈ గొడవలు అన్నీ మన కెందుకయ్యా?'' అని అన్నారు.

"ఇది గొడవా ? ఇందులో న్యాయం వుందా ?'' తీవ్రంగా అడిగాడు బ్రహ్మయ్య.

"పెట్టే చెయ్యే ఎప్పుడయినా కొట్ట వచ్చును. అదీ పద్ధతే."

" పద్ధతా నా బొందా ? ఎవరిది ఆ పెట్టే చెయ్యి ? ఈ గాలి ఎవడిది ? ఈ నీరు ఎవడి బాబుగాడి సొమ్ము ? ఈ భూమి మీ తాతగాడిదా ? కాదు. కాదు. ఎవడయితే దీన్ని దున్ని సాగుచేస్తాడో వాడిదే ఆ భూమి. అక్రమంగా ఈ భూముల్ని ఆక్రమించుకుని ఇవతలివాడు చమటోడ్చి సాధించిన శ్రమ ఫలితాన్ని బొక్కసాలలో నింపుకునేదేనా ఆ పెట్టే చెయ్యి ? కష్టజీవి సంపాదించి పెడుతూ వుంటే, దాన్ని ఈ సోమరిపోతులు జేబుల్లో దాచుకుంటున్నారు. పైగా దౌర్జన్యాలా ? ఆ దవుర్జన్యాలకి సమర్థనలా ?" — తీవ్రంగా అన్నాడు బ్రహ్మయ్య.

"అయితే ఇంతకీ నువ్వు అనేదేమిటి?" అన్నాడు సవిత పెద్దన్న.

"ఈ దోపిడీ, దౌర్జన్యాలూ ఇలాగ సాగటానికి వీలులేదు."

"అంటే ?"

"కష్టపడి పనిచేసిన ప్రతివాడికీ,

కడుపునిండా తినడానికి హక్కు వుంది కాని శ్రమజీవికి ఆ అవకాశం మీరు ఇవ్వటంలేదు. అతడ్ని మీరు దోచుకుంటున్నారు. అందుకోసం పద్ధతులూ, పాము పిల్లలూ అంటూ చెప్తూ మీ దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారు. చివరికి బంజరుభూములూ, పోరంబోకులూ కూడా మీ అక్రమ ఆక్రమణల కిందకి తెచ్చుకున్నారు. అందుకోసం మీరు అణచివేత పద్ధతుల్ని పాటిస్తున్నారు. ఇది ఇలాగ సాగటానికి వీలులేదు."

"నీ తలలో పురుగు పుట్టింది."

"కాదు. మీ తలల్లో స్థిరనివాసం ఏర్పరచుకున్న పురుగుల్ని ఏరివేయటానికే నా ప్రయత్నం."

"నోర్ముయ్యి"

"మీరే నోర్ముయ్యండి."

కలబడేదాకా వచ్చింది పరిస్థితి. కొందరి జోక్యం వలన ఆ ప్రయత్నం నివారింపబడింది.

ఆ రాత్రి సవిత తండ్రి వచ్చాడు. బ్రహ్మయ్యని దగ్గర కూర్చోపెట్టుకుని నచ్చచెప్ప బూశాడు.

"తరతరాలుగా వస్తూవున్న కట్టుబాట్లు ఎలాగ మార్చగలవు బాబూ?"

"వాటిని మార్చటానికి ప్రయత్నం అనేది సాగుతూనే వుంటుంది. ఫలితం సాధించేవరకూ ఆ ప్రయత్నం సాగక తప్పదు."

"కాని అందువలన మేము ఇబ్బందుల్లో పడుతున్నాము బాబూ! ఏది ఏమయినా మనం మనం ఒకటి కాదంటావా?"

"ఇటువంటి విషయాలలో అటువంటి బంధాలేవయినా వుంటే అవి ఛిన్నాభిన్నమయిపోక తప్పదు మామగారూ!"

"అంతేగాని నువు నీ పద్ధతి మార్చుకోనంటావు. అందువలన చాలా కష్టనష్టాలున్నాయి బాబూ! నీ మంచిని కోరేవాడిని. ఆలోచించు. ఇపుడు నీవు ఒంటరివిగాదు. నిన్నే నమ్ముకున్న నీ భార్యా, కూతురూ వున్నారు. మమ్మల్ని అర్థంచేసుకో నువు మారాలి."

"ఎవరికోసమూ ఎవరూమారరండీ?"

"నువ్వు చదువుకున్న విద్యావంతుడివి. నీ చదువు నీకు నేర్పింది అదేనా?"

"నా చదువు నాకు ఇదే నేర్పిందండీ. చుట్టూ చూడమంది. ఆలోచించమంది. అన్యాయాన్ని ఎదిరించి ఆచరణకి దూకమంది. ఇంతకంటే ఏ చదువయినా ఏం చెప్తుందండీ?"

విసిగి వేసారి వెళ్ళిపోయారాయన.

వ్యవసాయ కూలీలకి, రైతులకి పట్టుదలలు పెరిగాయి. ఆవేశకావేశాలు విజృంభించాయి. పొలాలు కళ దప్పి పాడుపడినట్లయాయి. కూలీల గుడిసెల్లో ఒక కొత్త గుడిసె వెలిసింది. బ్రహ్మయ్య మకాం అందులోకి మారింది.

అరుణ ఇప్పుడు మేనమామల ఇంటికి వెళ్ళటం మానేసింది. వాళ్ళు వెలివేయ బడ్డారు. సబిత పట్నంలో పంతులమ్మగా వుద్యోగం మొదలెట్టింది. తీరిక లేకుండా తిరుగుతూ వున్నారు బ్రహ్మయ్య. కూలీల్ని కూడగట్టి వూళ్లో అక్రమ ఆక్రమణలో వున్న బంజరుభూముల్ని ఆక్రమించటానికి ఉద్యమం ప్రారంభించాడు బ్రహ్మయ్య. చెదురు మదురు సంఘటనలు మొదలయ్యాయి. పెనగులాటల్లో కసి కార్పణ్యం విజృంభించాయి. ఆ వూరి వ్యవసాయ కూలీలు పదిమైళ్ళు నడిచి వేరేచోట పని చేసుకుని వస్తున్నారు. వేరే వూళ్ళనుంచి కూలీల్ని తెచ్చుకుని తమ పనులు చేయించుకుంటున్నారు రైతులు – అధిక వేతనాలు ఇచ్చి. ఆ భత్యాలే ఇస్తే వీళ్ళే చేద్దురు. కాని పట్టుదలలు అడ్డువచ్చాయి.

గడ్డిపరక వేస్తే భగ్గుమంటూ వుంది.

బయటి వూళ్ళనుంచి వచ్చేవాళ్ళను రాకుండా చెయ్యాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నాలు సాగకుండా వమ్ముచేయాలని అవతలి వాళ్ళు పథకాలు వేస్తున్నారు.

ఒకరోజున బంజరుభూముల్ని ఆక్రమించారు కూలీలు.

అవతలివాళ్ళు ప్రతిఘటించారు.

కర్రలు లేచాయి. తలకాయలు పగిలాయి. రక్తం పారింది.

పోలీసులు వచ్చి రెండు వైపుల వాళ్ళనీ పట్టుకెళ్ళింది. అవతలివాళ్ళు డబ్బు కట్టి బెయిలుమీద విడుదలయి వచ్చారు.

బ్రహ్మయ్య, అతని అనుచరులూ జైలులోనే వున్నారు.

కేసు నడిచింది.

బ్రహ్మయ్యకి మరి కొందరికి శిక్షలు పడ్డాయి.

సబిత బాగా చిక్కిపోయింది.

ఎముకలగూడువలె అయిపోయింది.

ఆమె అన్నలు ఆమె మొహం చూడడం మానుకున్నారు.

ఆమె తండ్రి మాత్రం కడుపుతీపిని చంపుకోలేక అప్పుడప్పుడూ చాటుగా వచ్చి కూతుర్ని చూసి వెళ్తూ వుంటాడు. ఒకరోజు సబిత తండ్రి వచ్చి పసిపిల్ల వాడివలె కన్నీరు పెట్టాడు.

"ఇంతా చేసి అల్లుడు సాధించింది ఏమిటి తల్లీ?"

"అదే నాకూ అర్థంకావటంలేదు నాన్నా."

"నిజంగానే నువ్వు ఆ మాట అంటున్నావా, సబితా?"

"నిజంగానే నాన్నా."

"అయితే అతనికి చెప్పి ఎందుకు మాన్పించవు? ఆ ప్రయత్నం నువ్వు ఎందుకు చెయ్యవు?"

"నా ప్రయత్నం నేను చేస్తూనే వున్నాను, నాన్నా."

"అయినా అతను నీ మాట వినలేదంటావు."

"ఆయన్ని మార్చటం ఎవరి తరమూ కాదు నాన్నా. అందుకే నేనే మారాను."

"నువ్వు మారావా ?"

"అవును నాన్నా. సంసారం చేస్తూ వున్నాక ఎవరో ఒకరు సర్దుకుపోవాలి గదా."

"అసలు నీకేం తక్కువని ఇట్లాంటి అవస్తని కొనితెచ్చుకున్నావమ్మా ! ఇలాగ దిక్కూ మొక్కూ లేకుండా ఆర్థాకలితో పడి వుండటం ... ఈ అవస్తలు..."

"మనిషికి - ఆకలిని తీర్చుకోవటం అవసరమేగాని, అదే అంత ముఖ్యమయినది కాదు నాన్నా."

"పోన్లే. ఒక్కగాను ఒక్క కూతురువి. ఒక ముచ్చటలేదు. నువ్వు ఇలాగ పడి బ్రతకటం చూడటం మాకు ఎంతబాధగావుంటుందో ఆలోచించమ్మా. అతనికేం? వెళ్ళి జైలులో కూర్చున్నాడు..."

"అయితే ఇప్పుడు నేనేం చెయ్యను నాన్నా ?"

"నువ్వూ, అరుణా వచ్చెయ్యండి. మాతో వుందురుగాని. మీ అమ్మ ఎంతో సంతోషిస్తుంది. ఆవిడ గుండెల్లోని దిగులూ, గుబులూ ఎగిరిపోతుంది. వాళ్ళకి ఎన్ని పట్టుదలలు వున్నా నీ అన్నలు కూడా ఎంతో సంతోషించి నిన్ను నెత్తిమీద పెట్టుకుంటారు."

"అది జరిగేది కాదు నాన్నా. నా భర్త నడిచేదే నా బాట..."

"అయితే - నిన్ను కన్న నేరానికి నీ కన్నతల్లి అలాగ కృంగి, కృశించి చనిపోవాల్సిందేనా ? నీ తల్లి ఎంత కాలంగానో మంచం దిగటంలేదు. నువ్వు రాకపోతే తను ఇక బ్రతకదు తల్లీ. తను ఏం నేరం చేసిందని ఆమెకి ఈ శిక్ష తల్లీ..." ఆయన పసివాడివలె ఏడ్చాడు.

"నాన్నా..." సవిత కళ్ళలో నీళ్ళు పొంగివచ్చాయి, తల్లి గురించిన ప్రస్తావనతో.

"నా మాట విను తల్లీ. కడుపుతీపి ఎంత గొప్పదో ఆంత భయంకరమైన దీను."

సవిత కన్నీరు తుడుచుకుంది.

"సరే. పద నాన్నా" అని కూతుర్ని తీసుకుని అతని వెంట వెళ్ళింది. అవసానదశలో వున్న 'సవిత తల్లి' కూతుర్ని చూసి కోలుకుని కొత్తజీవితం పొందింది. అందుకు చాలా రోజులు పట్టింది ఆమెకి.

అప్పుడే సవితకి జైలునుంచి బ్రహ్మయ్య వుత్తరం రాసాడు.

"సవితాదేవీ ! జైలులో వున్న నాకు మిత్రులద్వారా సంగతి సందర్భాలన్నీ తెలిసాయి. నేను నిన్ను నడిపించిన దారి ముళ్ళబాట అని నాకూ తెలుసు. ఎన్ని ప్రతికూలమయిన పరిస్థితులయినా

ఎదిరించి నువ్వూ నా దారినే నడుస్తావని నేను అనుకోవటం అత్యాశే. కాని ఇపుడు నీ దారిని నువ్వు ఎన్నుకున్నావని విని ఎంతో విచారించినా—నాకో సంతోషంగాను అన్పించింది. మన దారులు చీలాయి. అందుకు నేను నిన్ను నిందించను. ఒకవేళ నీవు నన్ను దూషించినా నేనేం అనుకోను. ఇకనుంచీ మనం భార్యాభర్తలం కాకపోయినా మంచి మిత్రులుగా నయినా వుందాము. ఇన్నాళ్ళ నా సాహచర్యంలో నా ప్రయత్నాల గురించిన కొంత అవగాహన నీకు ఏర్పడి వుండవచ్చునన్న ఆశే నా మనసులో నీ మీది మిత్రభావం ఇంకా కొంత మిగిలివుండేటట్టు చేసింది. అరుణని ధైర్యం, వుత్సాహమే వూపిరిగా బతికే వ్యక్తిగా తయారుచెయ్యటానికి ప్రయత్నించు. చాలా థాంక్సు సబితా. ఉంటాను—మిత్రుడు బ్రహ్మయ్య."

ఆ వుత్తరం చాలా దుఃఖాన్ని తెచ్చి పెట్టింది సబితకి. లోలోపల ఎంతగానో కుమిలిపోయింది. అరుణనికావలించుకొని ముద్దాడింది సబిత. బ్రహ్మయ్యది కఠోరమైన నిర్ణయం! అది ఇక మారదు. ఆ వుత్తరం సంగతి తెలిసి బంధులు తొక్కారు ఆమె అన్నలు.

ఆమె తండ్రి దిగులుతో కృంగిపోయాడు. మంచం పట్టాడు.

ఆ దిగులుతోనే ఆమె తల్లి కన్ను మూసింది.

శిక్ష పూర్తయింది.

బ్రహ్మయ్యని అతని అనుచరుల్ని వదిలిపెట్టారు.

ఊళ్లో మరల గొడవలు మొదలయ్యాయి. అడపా దడపా సంఘటనలు జరిగాయి. ఆవేశం కావేశం విజృంభించాయి.

ఇపుడు — సబితని, అరుణని పూర్తిగా మరిచిపోయాడు బ్రహ్మయ్య. మనిషి పూర్తిగా మారిపోయాడు. ఈ బ్రహ్మయ్య బాగా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకు పోయాయి. బుగ్గలు లోపలికి తోసుకనిపోయాయి. కొండంత మనిషి కేవలం అస్థిపంజరంగా మిగిలిపోయాడు. ఈ మధ్య అతన్ని దగ్గు వొకటి పట్టుకుంది. ఆ దగ్గుతోపాటు రక్తం కూడా పడుతూ వుంది. వేళకి నిద్ర లేదు. తిండి తిప్పలు లేవు. గడ్డం పెరిగింది. జుట్టుమాసి జడలు కట్టినట్లుగా అయింది. అయినా ఆ కళ్ళల్లో ఒక పట్టుదల—ఒక మెరుపు-ఒక ఆలోచన.

ఆ రోజు అపరాత్రి సబిత దగ్గరికి వచ్చి కూర్చున్నారు ఆమె అన్నలు. వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్న దాన్నిబట్టి సబితకి అర్థమయింది.

"ఊరు అతలాకుతలమయింది. తలకాయలు పగలటం సర్వసాధారణమయింది. ప్రశాంతమయిన పల్లెపట్టు జీవనంలో అశాంతి చోటు చేసుకుంది ఎవరూ తలెత్తుకుని తిరగలేకుండా వున్నారు. మంచీ, చెడూ లేకుండా

పోయింది. తమ మోచేతి క్రింది సీళ్ళుతాగి బ్రతకవలసిన కూలీల ఆగడాలు పెచ్చు మీరిపోతున్నాయి. పోరంబోకు భూముల్ని ఆక్రమించి దారులు లేకుండా చేశారు వాళ్ళు వూరి చెరువు నీరు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. అదేమన్న వాళ్ళని దారుణంగా అవమానిస్తున్నారు. సమాజ జీవనం ఛిన్నాభిన్నమయింది. కట్టుబాట్లు తెగిపోయాయి. ఒక విశృంఖలత విశ్వ విహారం చేస్తూ వుంది. దీన్ని ఇలాగే సాగనిస్తే ఏది ఎలాగ అవుతుందోనన్న భయం, గగుర్పాటు జనాన్ని వెర్రెత్తిస్తున్నది. అందువలన అందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు."

—సబిత గుండెల్లో గుబులు తొంగి చూసింది.

"ఈ పరిస్థితికి కారణమయిన ఒకే ఒక్క వేరుపురుగుని తొలగించటమే ఆ నిర్ణయం. మిగిలివున్న ఆ ఒక్క బంధాన్నీ అతనే త్రెంపివేసుకున్నాడు. అతనికి మనసు అనేది వుందా? మమత అసలే లేదా? విశ్వాసం అంటే ఏమిటో తెలుసా? అనురాగం, ఆత్మీయత, అనుబంధం అనేవి అసలు వుండవా? అతను ఏమి మనిషి?

అసలు అతను మనిషేనా అని?! మనిషే అయితే—తననే కోరి పెళ్ళిచేసుకుని, తననే నమ్ముకుని ఎన్నో కష్టాలు అవమానాలు సంతోషంతో అనుభవించటానికి సిద్ధమయిన, కట్టుకున్న భార్యని- ఒకే ఒక్క అల్పసంఘటన ఆధారంగా అలాగ క్రూరంగా వదిలివేయటానికి నిర్ణయం తీసుకుంటాడా? అలాగ బంధాలు పుటుక్కున త్రెంచివేసుకొనే వాడు మనిషిగా జీవించదగునా?

—భయంతో వొణికిపోయింది సబిత మనస్సు. గుండెలు వూగులాడాయి.

"తల్లీ! చెల్లీ! ఇన్నాళ్ళూ నిన్ను చూసే మేము – అజ్ఞాతవాసానికి సిద్ధపడిన, న్యాయంకోసం కట్టుబడిన పాండవుల వలె వుండిపోయాము. ఇక ఆ బంధనాలు లేవు. వాటిని అతనే త్రెంచివేసుకున్నాడు. ఏక్షణాన్నయితే అతను నీతో ఆ అనుబంధాన్ని త్రెంచివేసుకున్నాడో అప్పుడే మేమూ ఆ బంధాన్నుంచి విముక్తులమయ్యాము. ఇవాళ పెద్ద గొడవ జరగవచ్చును. ఆ గొడవలో ఏమయినా కావచ్చును. మమ్మల్ని క్షమించు చెల్లీ," అని చివ్వున లేచి పోయారు అయిదుగురూ.

'అన్నా, అన్నా.' అనే దీనాలాపం, ఆర్తనాదం సబిత నోటినుంచి వెలువడకముందే వాళ్ళు చాలా దూరం వెళ్ళిపోయారు—నకచకా-ఉద్రేకం పరవళ్ళు తొక్కుతుండగా.

పరుగులాంటి నడకతో వాళ్ళనే అనుసరించింది సబిత.

ఊరు మాటు మణిగింది. అర్ధరాత్రి దాటి ఎప్పుడో అయింది. ఆ తర్వాత చాలా గంటలూ గడిచాయి. ఒకటి రెండు కుక్కలు దీనంగా శోకిస్తున్నాయి.

ఊరికి వుత్తరాన వున్న స్మశానంలో నక్కలు గోలపెడ్తున్నాయి.

నల్లని కాటుకవంటి చీకటి. ఈదురు గాలి

ముళ్ళు గుచ్చుకున్నా— ఎదురుదెబ్బ లకి కాళ్ళుపగిలి రక్తంచిమ్మినా లెక్క చేయలేదు సవిత. గుండెల్లోంచి ఎగ దన్నుకవస్తూవున్న ఆందోళనని అణుచు కోలేక పడుతూలేస్తూ పరుగెత్తింది సవిత—పిచ్చిపట్టినట్లు.

రచ్చబండ దగ్గర చేరిన నలుగుర్నీ కూడగట్టుకుని కర్రలు, బ్యాటరీలైట్లూ తీసుకుని డొంకవెంట సాగిపోయారు 'వాళ్ళు'. పరుగుతోవాళ్ళని వెంటాడింది సవిత.

అంతలోనే—కేకలు - పెడబొబ్బలు. భీషణమైన దూషణలు.

కర్రలు లేచాయి.

టపటప మన్నాయి.

ఆ క్రందనలు చెలరేగాయి,

భీషణంగా సాగుతున్నది పోరాటం.

"ఆగండి. ఆగండి" అంటూ ముందుకి దూకి వారి మధ్యకి వెళ్ళింది సవిత.

వెంటనే 'అమ్మా, అయ్యో' — ఆక్రందన చేసింది బాధగా. సవిత శరీరం క్షణాల్లో రక్తసిక్తమయింది, తమమధ్య స్త్రీ గొంతువిని అందరూ ఆగిపోయారు. బ్యాటరీలైటు వెలిగింది. ఆ వెలుగులో రక్తంలో మునిగి—తల బ్రద్దలయిన సవితని ముందువరుసలో నిలబడివున్న అటు బ్రహ్మయ్య—ఇటు ఆమె పెద్దన్నా ఇద్దరూ చూసారు. ఆమె అన్నలు తెల్లబోయి నిశ్చేష్ట లయారు. ఆమెను ఆస్థితిలో చూడగానే గిర్రున వెనకిరిగాడు బ్రహ్మయ్య.అతని వెనకే అతని అనుచరులూ.

'చెల్లీ!'

బావురుమని ఏడుస్తూ ఆమెమీద పడ్డారు ఆమె అన్నలు అయిదుగురూ— పసిపిల్లల్లా విలవిలలాడి పోయారు కసి దీరా అతన్ని తిట్టుకుంటూ చెల్లెలిశవాన్ని భుజాలమీదకి ఎత్తుకున్నారు.

గబగబ నడుస్తూవున్న బ్రహ్మయ్య హఠాత్తుగా ఆగాడు. వెలికలు తిరిగాడు బాధతో విలవిలలాడ్తూగిలగిల్లాడ్తూ క్రింద కూలిపోయాడు. వెళ్ళు వెళ్ళునదగ్గాడు. ఊళాడు. బాటరీలైటు వెల్తురులో—అతను వూసింది రక్తమని చలనరహితుడుగా అయిపోయిన అతను నిర్జీవుడనీ—అతని అనుచరులకి అర్థమయింది.బ్రహ్మయ్యని భుజాలమీదకి ఎత్తుకున్నారు వాళ్ళు. కసిగా తిట్టుకుంటూ—కరడుగట్టినభూస్వా ముల తత్వాన్ని నిరసిస్తూ ముందుకి సాగారు.

తెలతెల వారుతోంది.

అప్పుడే తూర్పుదిక్కున ఎర్రని రంగులు తొంగిచూస్తూ వున్నాయి. ఆ రంగుల మేలవింపులో ఆందోళనవుంది. ఆవేశమూ వుంది. ఆ రంగులు వేటికి ప్రతీకలు అన్న సంగతిని ఎవరికివాళ్ళు నిర్ణయించుకోవటంలోనే ఔచిత్యం వుందనిపిస్తుంది.